సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 18 । ఏప్రిల్ । 2023



గంజాయి ముఠా అరెస్టు

భీమడోలు మండలంలో గేదెల యజమానిపై దాడి ఘటనలో గంజాయి ముఠాకు చెందిన నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు.

8లో ▸



నిప్పు ముప్పు తప్పేలా !

వేసవిలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయనే హెచ్చరికల నేపథ్యంలో అగ్నిమాపక శాఖ అప్రమత్తమైంది. మాక్ డ్రిల్‌తో ప్రజలను అప్రమత్తం చేస్తోంది.

8లో ▸

22 నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు



ఏలూరు రామచంద్రరావు పేటలోని శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో ఈ నెల 22 నుంచి 27వ తేదీ వరకు వైశాఖ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు.

8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళవారం సాయంత్రం	సహరి బుధవారం వేకువజాము
భీమవరం	6.26	4.23
తాడేపల్లిగూడెం	6.28	4.32
నరసాపురం	6.27	4.22

న్యూస్‌రీల్

వేగంగా 100 పడకల ఆసుపత్రి నిర్మాణం



ఏపీఐఎంసీడీ అధికారులతో ఆసుపత్రి నిర్మాణంపై మాట్లాడుతున్న శ్రీనివాస్

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చెప్పారు. సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఏపీఐఎంసీడీ అధికారులతో ఆసుపత్రి నిర్మాణంపై సమీక్ష సమావేశం నిర్వహించిన అనంతరం శ్రీనివాస్ వివరాలను వెల్లడించారు. 100 పడకల ఆసుపత్రి జిల్లా ప్రజలతోపాటు కృష్ణాజిల్లా ప్రజలకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అన్ని విభాగాలకు సంబంధించి స్పెషలిస్టులతో పాటుగా ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉంటాయన్నారు. రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన చర్యలు ప్రశంసనీయమన్నారు. సమీక్షా సమావేశంలో ఏపీఐఎంసీడీ డీఈ శ్రీనివాస్ రెడ్డి, ఎన్‌సిసి చైతన్యకృష్ణ పాల్గొన్నారు.

స్పందనలో సమస్యల సత్వర పరిష్కారం



స్పందన కార్యక్రమంలో బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: భీమవరం డీఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఫిర్యాదులు అందజేశారు. ఎస్పీ యు.రవిప్రకాష్ ఫిర్యాదులను స్వీకరించి బాధితులతో మాట్లాడారు. తనకు ఆడపిల్ల పుట్టిందని తన భర్త కాపురానికి తీసుకెళ్లడం లేదని భీమవరం మండలానికి చెందిన మహిళ ఫిర్యదు చేసింది. తన భర్త లోన్‌యాప్‌లో తీసుకున్న రుణం తిరిగి చెల్లించినా లోన్ యాప్ నిర్వాహకులు వేధిస్తున్నారని భీమవరం టూటౌన్‌కు చెందిన మహిళ ఫిర్యాదు చేసింది. తన భర్త, అత్త మామలు కట్నం కోసం వేధిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని పాలకోడేరు మండలానికి చెందిన మహిళ కోరింది. ఎస్పీ రవిప్రకాష్ మాట్లాడుతూ స్పందనలో ఫిర్యాదులన్నింటిపై సత్వరమే చట్ట ప్రకారం విచారణ జరిపి పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.

పదో తరగతి పరీక్షకు 99.48 శాతం హాజరు

సాక్షి, భీమవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం నిర్వహించిన సంస్కృత పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 99.48 శాతం విద్యార్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3,871 మంది హాజరుకావల్సివుండగా 3,851 మంది హాజరయ్యారని చెప్పారు.

సేవ్ గర్ల్ చైల్డ్ పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు చెక్‌లు అందచేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): సేవ్ గర్ల్ చైల్డ్ ప్రోగ్రాంపై అవగాహన కార్యక్రమంలో భాగంగా వివిధ పాఠశాలల్లో నిర్వహించిన వ్యాసరచన, డిబేట్స్, డ్రాయింగ్ తదితర పోటీలలో విజేతలకు కలెక్టరు పి.ప్రశాంతి బహుమతులు పంపిణీ చేశారు. ప్రథమ బహుమతి సాధించిన వారికి రూ.10,000, రెండో బహుమతిగా రూ.5,000, మూడో బహుమతిగా రూ.3000 చొప్పున 9 మంది విజేతలకు రూ. 54 వేల చెక్కులను అందజేశారు.

విద్యుత్ కోతలకు చెక్

- వేసవిలో సజావుగా విద్యుత్ సరఫరాకు చర్యలు
- కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణం
- వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ సరఫరా



ఏలూరులోని ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వేసవి వచ్చిందంటే చాలు విద్యుత్‌కు విపరీతమైన డిమాండ్ పెరిగిపోతుంది. ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలను మించిపోతుండడంతో ఏసీలు, కూలర్ల కామన్ అయిపోయాయి. దీంతో డిమాండ్‌కు సరిపడా విద్యుత్ సరఫరా లేక కోతలతో ప్రజలు సతమతమయ్యేవారు. గతంలో వేసవిలో విద్యుత్ కోతలతో జనం అల్లాడిపోయేవారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాం నుంచి ప్రజలకు వేసవిలో పూర్తి స్థాయిలో విద్యుత్‌ను అందించడానికి ప్రైవేట్ సంస్థల నుంచి కొనుగోలు చేసి సరఫరా ప్రారంభించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్ సైతం తండ్రి ఆశయాలను కొనసాగిస్తూ వేసవిలో ప్రజలకు ఇబ్బంది లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని విద్యుత్ సంస్థలను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ అధికారులు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయడానికి ట్రాన్స్‌కో అధికారులను సమన్వయం చేసుకుంటూ తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. మార్చి చివరి వారం నుంచి ఏప్రిల్ తొలి వారం వరకూ అల్పపీడన ద్రోణులు ఏర్పడడంతో సాధారణ ఉష్ణోగ్రతలే నమోదయ్యాయి. గత నాలుగు రోజులుగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. అత్యధిక ఉష్ణోగ్రతలతో పాటు వడగాల్పులు వీస్తుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. జూన్ నెల చివరి వరకూ ఉష్ణోగ్రతలు ఇలాగే నమోదవుతాయని హెచ్చరికల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరాకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

వేసవిలో నిరంతర విద్యుత్



వేసవిలో నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించడానికి తగిన ఏర్పాటు చేశాం. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా (ఏలూరు ఆపరేషన్ సర్కిల్) పరిధిలో 12,49,370 గృహ విద్యుత్ సర్వీసులు, 1,51,992 కమర్షియల్ సర్వీసులు ఉన్నాయి. వేసవిలో విద్యుత్ వినియోగం సాధారణ రోజులకంటే దాదాపు 50 శాతం అధికంగా ఉంటుంది. అయినప్పటికీ ప్రజల డిమాండ్ మేరకు సరఫరా చేయడానికి ట్రాన్స్ కో అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాం. వ్యవసాయానికి సైతం పగటి పూట 9 గంటలు నిరంతరాయ విద్యుత్ అందిస్తున్నాం.

– పి.సాల్మన్ రాజు, ఏలూరు సర్కిల్ ఎస్ఈ, ఈపీడీసీఎల్

కొత్త సబ్ స్టేషన్ల ఏర్పాటు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేసవిలో విద్యుత్ వినియోగాన్ని తట్టుకోవడానికి విద్యుత్ సంస్థ అధికారులు నూతన సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు ఆకివీడులో 220/132/33 కేవీ సబ్ స్టేషన్లు రెండు, ద్వారకా తిరుమల, నారాయణపురంలలో 132/33 కేవీ సబ్ స్టేషన్లను రూ. 109 కోట్లతో నిర్మించారు. రుస్తుంబాద, కొవ్వాకల్లో 220/132/33 కేవీ సబ్‌స్టేషన్లు, టీ.నరసాపురం, ధర్మాజీగూడెంలో 132/33 కేవీ సబ్ స్టేషన్లను రూ. 219 కోట్లతో నిర్మించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 160 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీని 63 నుంచి 100కు, 100 నుంచి 160కి పెంచడానికి రూ.5.52 కోట్ల నిధులు వెచ్చించారు. జిల్లాలోని 18 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని సైతం పెంచడానికి రూ.14.43 కోట్ల నిధులు వెచ్చించారు. ఆయా సబ్ స్టేషన్ల నుంచి విద్యుత్ సరఫరాకు రూ.2.50 కోట్లతో 4 లైన్లకు రూ.16 కిలోమీటర్ల విద్యుత్ తీగలను సిద్ధం చేశారు.

పాత సబ్‌స్టేషన్లకు మరమ్మతులు

పనిచేయని సబ్ స్టేషన్లను తిరిగి ఉపయోగంలోకి తీసుకొస్తూ, కొత్తవి నిర్మిస్తూ పనులు వేగంగా పూర్తి చేస్తున్నారు. కామవరపు కోటలో 100 మెగావాట్ల సామర్థ్యం ఉన్న సబ్ స్టేషన్‌ను ఉపయోగంలోకి తీసుకొచ్చారు. భీమవరం, నల్లజర్లలో 50 మెగావాట్ల ఉన్న సామర్థ్యాన్ని 80 మెగావాట్లకు పెంచారు. ఆకివీడు వద్ద గుమ్ములూరులో, భీమడోలు మండలం గుండుగొలనులో 33/11 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణానికి ఇటీవలే భూమిపూజ చేసి వాటి నిర్మాణాన్ని 45 రోజుల్లో పూర్తి చేయడానికి చర్యలు చేపట్టారు. నిడమర్రులో రూ. 3.23 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్ ప్రారంభానికి సిద్ధంగా ఉంది.

వ్యవసాయానికి కోతలు లేకుండా

వేసవిలో రైతులకు నీటి కొరత లేకుండా ఉండేందుకు, మెట్ట ప్రాంత రైతులకు బోర్ల ద్వారా నీటిని ఇచ్చేందుకు విద్యుత్ అవసరం ఎంతో ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ వేసవిని అధిగమించడానికి విద్యుత్ అధికారులు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. జిల్లాలోని 1,01,635 వ్యవసాయ పంపుసెట్లకు నిరంతరాయంగా 9 గంటల పాటు విద్యుత్ సరఫరాకు రూ.99.48 కోట్లతో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు భోగాపురం, తాళ్ల గోకవరం, సాగిపాడు, విజయరాయి, నిమ్మలగూడెం, చక్రదేవరపల్లి, వేగవరం, కొండగూడెం, చిక్కాలపాలెం, గౌరీపట్నం, కృష్ణంపాలెంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్లను యుద్ధప్రాతిపదికన నిర్మించి ఆయా సబ్ స్టేషన్లను ఇప్పటికే ప్రారంభించారు.

ఫిష్ ఆంధ్రా యూనిట్లపై సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): ఫిష్ ఆంధ్రా యూనిట్లు త్వరితగతిన గ్రౌండింగ్ అయ్యేలా సంబంధిత అధికారులు కృషి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. భీమవరంలోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ పి.ప్రశాంతి జిల్లాలో ఫిష్ ఆంధ్రా యూనిట్ల స్థాపనపై సోమవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని కేటగిరిలలోని యూనిట్ల స్థాపనకు లబ్ధిదారుల ఎంపికను త్వరితగతిన పూర్తిచేసి రుణాల మంజూరుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. రూ.50 లక్షల యూనిట్ స్థాపనకు భీమవరంలో గుర్తించిన స్థలాన్ని లీజుకు ఇవ్వడానికి సూత్రపాయంగా కలెక్టర్ అంగీకారం తెలిపారు. స్థలాన్ని పరిశీలించి నివేదిక సమర్పించాలని మత్స్య శాఖ అధికారులకు సూచించారు. నాలుగు, మూడు, ద్విచక్ర వాహనాల ద్వారా వ్యాపారం చేసే లబ్ధిదారులకు వెంటనే వాహనాలను సబ్సిడీపై అందించేందుకు బ్యాంకులకు ప్రతిపాదనలు పంపాలన్నారు. లబ్ధిదారులకు అత్యధిక సబ్సిడీ ఇచ్చే పథకంగా ఫిష్ ఆంధ్రా యూనిట్లు ఉన్నాయని, లబ్ధిదారులకు అవగాహన కల్పించి యూనిట్ల స్థాపకు ముందుకు వచ్చేలా ప్రోత్సహించాలన్నారు. త్వరితగతిన ఫిష్ ఆంధ్రా యూనిట్లు గ్రౌండింగ్ అయ్యేలా చూడాలని అధికారులకు కలెక్టరు స్పష్టం చేశారుసమావేశంలో జిల్లా మత్స్య శాఖ అధికారి ఆర్‌వీఎస్‌వీ ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, మెప్మా పీడీ ఇమ్మానుయేల్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దుర్గేష్, మత్స్య శాఖ ఏడీ ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

రైతుకు లాభం చేకూర్చడమే ధ్యేయం

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



సీతారామపురం రైతుభరోసా కేంద్రం వద్ద ట్రాక్టర్ ప్రారంభిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: రైతుకు వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడమే ప్రభుత్వ ధ్యేయమని, అందుకు అనుగుణంగా దళారీ వ్యవస్థను నిర్మూలించి పారదర్శకంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిర్వహిస్తున్నామని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. సోమవారం నరసాపురం మండలం సీతారామపురంలో స్థానిక రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను దళారులు, మిల్లర్లు మోసాలకు గురి చేయకుండా రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు వల్ల అన్ని విధాలా భరోసా ఏర్పడిందన్నారు. వీటిద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించడంతోపాటు పంట పండించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నారన్నారు. పండించిన పంటను ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరకు అమ్ముకునేలా చేయడమే ఈ కేంద్రాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఖరీఫ్ సీజన్‌లో 65,660 మంది రైతుల నుంచి 3.77లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.768 కోట్లు రైతులకు చెల్లించారన్నారు. మద్దతు ధరతోపాటు గోనె సంచులు, లేబర్, రవాణా చార్జీలను 21 రోజుల్లోపుగానే రైతుల ఖాతాలకు జమచేస్తున్నారన్నారు. దళారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరకు రైతులు ఆన్‌లైన్ విధానంద్వారా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. అనంతరం వ్యవసాయ శాఖ సబ్సిడీపై పాలపర్తి రమేష్‌కు అందించిన ట్రాక్టర్‌ను ప్రసాదరాజు ప్రారంభించారు. రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ సలహా సంఘ సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శివరామప్రసాద్, జిల్లా సహకార శాఖ అధికారి రవికుమార్, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, సీతారామపురం సొసైటీ చైర్మన్ పులపర్తి ప్రతాప్, ఆత్మ కమిటీ చైర్మన్ కడలి రాంబాబు, ఏడీఏ ఈదా అనిల్‌కుమారి, జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ తదితరులు మాట్లాడారు. వ్యవసాయ సలహామండలి బోర్డు చైర్మన్లు కాండ్రేగులు నర్సింహారావు, కంచర్ల బాబులు, అండ్రాజు చల్లారావు, గ్రామ సర్పంచ్ పులపర్తి భ్రమరాంభ తదితరులు పాల్గొన్నారు.

దిశ మరింత బలోపేతం

- గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక డ్రైవ్
- సోషల్ మీడియాలో విద్వేషపూరిత ప్రచారంపై నిఘా
- రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు
- 'సాక్షి'తో ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్ కుమార్



సాక్షి ప్రతినిధి, ఏలూరు: దిశ పోలీస్‌స్టేషన్లను మరింత బలోపేతం చేస్తామని.. ఏలూరు రేంజ్ పరిధిలోని అన్ని పోలీస్ జిల్లాల్లో మహిళల రక్షణ, భద్రత కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఏలూరు రేంజ్ నూతన డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ స్పష్టం చేశారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తామని ఆయన తెలిపారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే ప్రకటనలు, విద్వేషపూరిత ఘటనలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని చెప్పారు. రేంజ్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని.. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అక్రమ రవాణా కట్టడి చేస్తామని వివరించారు. సోమవారం 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడి ప్రాధాన్యతాంశాలు వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

గంజాయి కట్టడికి స్పెషల్ డ్రైవ్

రేంజ్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. గతేడాది రేంజ్ పరిధిలో 3 లక్షల కిలోలకు పైగా గంజాయి ధ్వంసం చేశాం. రేంజ్ పరిధిలో జాతీయ రహదారి ఎక్కువ ఉండటం వల్ల అక్రమ రవాణాకు అవకాశం ఉంది. ఈ క్రమంలో రహదారిపై ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి ఆకస్మిక తనిఖీలు, స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి కట్టడి చేస్తాం. కళాశాల స్థాయికి గంజాయి వ్యాప్తి చెందకుండా అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు గతంలో గుర్తించిన ప్రాంతాల్లో కీలక నిఘా కొనసాగుతుంది. రేంజ్ పరిధిలోని ఎస్పీలతో ప్రతి 15 రోజులకోసారి సమీక్షలు నిర్వహించి పురోగతి సాధిస్తాం.

దిశతో మహిళలకు రక్షణ

దిశ పోలీస్‌స్టేషన్లు దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచాయి. రేంజ్ పరిధిలోని 6 పోలీస్ జిల్లాల్లో దిశ స్టేషన్లు వచ్చాక దిశ యాప్ డౌన్‌లోడ్ మొదలుకుని పోక్సో యాక్ట్ కింద నమోదయ్యే కేసులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. పోక్సో కేసుల్లో సాధ్యమైనంత త్వరగా శిక్ష పడేలా చార్జీషీట్ దాఖలు చేస్తున్నాం. మహిళా పోలీసులతో సచివాలయ మహిళా పోలీసుల్ని సమన్వయం చేస్తున్నాం. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో గ్రామ, వార్డు సచివాలయాల్లో సగటున 20–25 మంది మహిళా పోలీసులు అదనంగా ఉన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో చిన్నారులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగేలా మహిళా పోలీసులతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాం.

రెచ్చగొడితే కఠిన చర్యలు

సోషల్ మీడియాలో కొందరు రెచ్చగొట్టే పోస్టులు పెడుతున్నారు. విద్వేషపూరిత వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. సోషల్ మీడియా యాక్ట్ రూల్స్‌ను అనుసరించి విద్వేషపూరిత పోస్టులు పెట్టేవారిపై సీరియస్‌గా వ్యవహరించడంతో పాటు స్టేషన్ల వారీగా నిరంతరం నిఘా కొనసాగేలా చేస్తాం. సోషల్ మీడియాలో చిన్న మెసేజ్ పెట్టి గందరగోళం సృష్టించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. చిన్న పోస్టు ద్వారా కుల, మత ఘర్షణలకు అవకాశం కల్పించి మూడు, నాలుగు రోజుల పాటు శాంతిభద్రతలకు ఇబ్బందులు కలిగించే కొందరిని ఇప్పటికే గుర్తించాం.

పక్కాగా లా అండ్ ఆర్డర్ అమలు

రేంజ్ పరిధిలో లా అండ్ ఆర్డర్ పక్కాగా అమలు చేస్తాం. పోలీసులపై ఫిర్యాదులు వస్తే రోజుల వ్యవధిలో విచారణ పూర్తి చేసి సీరియస్‌గా స్పందిస్తాం. స్టేషన్లకు వచ్చే వారికి పూర్తి న్యాయం బాధ్యత సంబంధిత సీఐలు, ఎస్సైలపై ఉంది. ప్రలోభాలకు లొంగితే సస్పెన్షన్ వేటు తప్పదు. పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి త్వరితగతిన పూర్తి చేస్తాం.

దరఖాస్తులు వేగంగా పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి



అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): స్పందనలో అందిన ప్రతి దరఖాస్తును వేగంగా పరిష్కరించాలని, అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కారం అందించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం భీమవరం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్పందనలో ఆమె పాల్గొని అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్జీలు తిరిగి రీ ఓపెన్ అయ్యే అవకాశం లేకుండా శాశ్వత పరిష్కారం చేయాలన్నారు. ఒకే సమస్యపై రెండోసారి స్పందనలో ఫిర్యాదు రాకుండా సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతి రోజు స్పందనపై పది నిమిషాల సమయం కేటాయిస్తే ఎప్పటి సమస్యలు అప్పుడే పరిష్కారం అవుతాయన్నారు. స్పందన కార్యక్రమంలో 209 దరఖాస్తులు వచ్చాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి , డీఆర్వో కె.కృష్ణవేణి, డీపీఓ ఎం. నాగలత తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాంపై సమీక్ష

జగనన్నకు చెబుదాంలో దరఖాస్తులను ప్రతి జిల్లా అధికారి పరిశీలించి సమీక్ష చేసి పరిష్కరించాలని కలెక్టరు పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరు కార్యాలయంలోని స్పందన సమావేశంలో జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం పోర్టల్‌ను కొంతమంది అధికారులు ఓపెన్ చేసి చూడడం లేదని అన్నారు. తమ శాఖలకు సంబంధించి దరఖాస్తులపై వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. కొంతమంది తహసీల్దారులు ఇన్‌కం సర్టిఫికెట్ జారీ చేయడానికి నిర్ణీత సమయం కంటే ఎక్కువ సమయం తీసుకుంటున్నారని ఇన్‌కం సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసిన వాటిని పరిశీలించి సర్టిఫికెట్లు జారీ చేయాలని ఆదేశించారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో ప్రతి ఇంటికి డాక్టర్ల బృందం తప్పనిసరిగా విజిట్ చేయాలని, విజిట్ చేసేటప్పుడు ఎస్‌హెచ్‌జీ మహిళా సభ్యులను, వలంటీర్ల సాయం తీసుకోవాలని సూచించారు. ఆధార్ అప్‌డేట్ పెండింగ్ ఇంకా చాలా ఉందని అన్ని సచివాలయాల్లో , పోస్టాఫీసుల్లో, బ్యాంకుల్లో అప్‌డేట్ త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టరు ఆదేశించారు. ఆధార్ తీసుకుని పది సంవత్సరాలు దాటిన వారు అప్‌డేట్ విధిగా చేసుకోవాలని కలెక్టరు సూచించారు.

మతపరమైన కట్టడాలకు అనుమతి తప్పనిసరి

పంచాయతీరాజ్ చట్టాన్ని అనుసరించి మతపరమైన కట్టడాలకు ముందస్తు అనుమతులు అవసరమని, దీనిపట్ల ఆయా మండలాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి గృహ నిర్మాణం, ఎన్ఆర్ఈజీఎస్, రీ సర్వే, ఫీవర్ సర్వే తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. పంచాయతీరాజ్ యాక్ట్‌ను అనుసరించి మతపరమైన కట్టడాలకు ముందస్తు అనుమతులు అవసరం అని, దీనిపట్ల ఆయా మండలాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ప్రతి రోగి హెల్త్ రికార్డ్‌ను తప్పకుండా కొనసాగించాలన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేసేందుకు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం సేకరణకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా ముందే చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే తాడేపల్లిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించామన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు ఎస్పీ డి.మేరీ ప్రశాంతి



స్పందనలో ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో ప్రజలకు ఉత్తమ సేవలు అందించటం, శాంతిభద్రతల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో స్పందనలో ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. బాధితుల సమస్యలపై సంబంధిత స్టేషన్ అధికారులకు ఫోన్‌చేసి వాటి పరిష్కారంపై ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్ళ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే లింకులకు స్పందిస్తే బ్యాంకు ఖాతా ఖాళీ అవుతుందని హెచ్చరించారు.

పదో తరగతి పరీక్షా కేంద్రాల తనిఖీ

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో పదో తరగతి పరీక్షా కేంద్రాలను, ఏలూరు వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీస్‌స్టేషన్లను ఎస్పీ మేరీ ప్రశాంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు, విద్యార్థులకు మౌలిక సదుపాయాలపై పరిశీలించారు. పరీక్షలు జరుగుతున్న తీరును పర్యవేక్షించారు. ఎస్పీ వెంట ఎస్‌బీ సీఐ ఎం.సుబ్బారావు, సిబ్బంది ఉన్నారు. వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీస్‌స్టేషన్లను ఎస్పీ తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్లలో రిసెప్షన్ కౌంటర్లను పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారుల సమస్యలపై సత్వరమే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా నడచుకోవాలనీ, ప్రతీ ఫిర్యాదును రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు.

మన్యంలో పర్యటించిన అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన కామయ్యకుంటలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ అపూర్వ భరత్ సోమవారం పర్యటించారు. గ్రామంలోని సచివాలయాన్ని సందర్శించారు. రిజిస్టర్లు తనిఖీ చేయడంతో పాటు సచివాలయ సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. గ్రామస్తుల జీవన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. పంటల గురించి ఆరా తీశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలుతీరును, వారికి అందుతున్న వివరాల గురించి తెలుసుకున్నారు. మరో నాలుగు రోజుల పాటు గిరిజన గ్రామాల్లో ట్రైనీ కలెక్టర్ పర్యటించి వారి స్థితిగతులు, ప్రభుత్వ పథకాల తీరును తెలుసుకుంటారని ఐటీడీఏ అధికారులు తెలిపారు.

ఎస్ఈబీ దాడుల్లో ముగ్గురి అరెస్టు


నిందితులను అరెస్టు చేసిన ఎస్ఈబీ అధికారులు

నూజివీడు: స్థానిక ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాల పరిధిలో సోమవారం నిర్వహించిన దాడుల్లో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ టీ గోపాలకృష్ణ చెప్పారు. ఆగిరిపల్లి మండలంలోని సింహాద్రి అప్పారావుపేటలో దేరంగుల కిషోర్‌బాబు వద్ద 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని అతనిని అరెస్టు చేశామన్నారు. అలాగే చాట్రాయి మండల పోతనపల్లికి చెందిన మాలావతి జ్యోతి వద్ద 2 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామన్నారు. అదేవిధంగా ముసునూరుకు చెందిన అనగాని కృష్ణారావును అదుపులోకి తీసుకుని, అతని నుంచి తెలంగాణకు చెందిన 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

ముసునూరులో 35 బాటిళ్ల స్వాధీనం

ముసునూరు: అక్రమంగా మద్యం తరలిస్తుండగా అందిన సమాచారంతో దాడి చేసి రమణక్కపేటకు చెందిన రంగు వెంకటేశ్వరరావు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని నుంచి 35 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ గోపాలకృష్ణ సోమవారం చెప్పారు.

నిప్పు ముప్పు తప్పేలా!

- వేసవిలో పొంచి ఉన్న అగ్ని ప్రమాదాలు
- నివారణ చర్యలపై ముమ్మరంగా కార్యక్రమాలు
- పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా అవగాహన
- ఈ నెల 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు


తణుకు వారోత్సవాల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది


తణుకులో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఫైర్ సిబ్బంది

తణుకు: ఈ ఏడాది వేసవి ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయిలో నమోదవుతాయనే హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఇదే సమయంలో అగ్ని ప్రమాదాలు పొంచి ఉన్నాయి. సాధారణంగా వేసవిలోనే అగ్ని ప్రమాదాలు ఎక్కువగా ఉంటాయి. ఈ నేపథ్యంలో అగ్ని ప్రమాదాల తీవ్రత తగ్గించి ప్రాణాలు, ఆస్తులను కాపాడేందుకు అగ్నిమాపక శాఖ మాక్ డ్రిల్‌తో ప్రజలను అప్రమత్తం చేస్తోంది. ఇందుకు ఈనెల 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తోంది. ముందు జాగ్రత్తలు తీసుకుంటే ప్రాథమిక దశలోనే అగ్ని ప్రమాదాలు నివారించవచ్చని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. 1944లో ముంబాయి డాక్ యార్డులో అగ్ని ప్రమాదం సంభవించిన సమయంలో మంటలను అదుపు చేసేందుకు వెళ్లిన 66 మంది ఫైర్ సిబ్బందితోపాటు అనేక మంది ప్రమాదంలో మృతి చెందారు. వారి ఆత్మకు శాంతి చేకూర్చేందుకు ప్రతి ఏటా ఏప్రిల్ 14 నుంచి అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించి అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అగ్నిమాపక అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా తణుకు అగ్నిమాపక అధికారి ఐ.అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది తణుకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహిస్తూ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. అగ్నిప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరు జాగ్రత్తలు పాటించాలని కోరుతున్నారు.

ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి

- గృహాలకు సంబంధించి ఐఎస్ఐ ఎలక్ట్రికల్ వైర్లను వాడాలి. పాడైన వైర్లను వాడి ఓవర్‌లోడ్ వేయకూడదు. ఎలక్ట్రికల్ సాకెట్‌లో కెపాసిటీకి తగిన ప్లగ్‌ను మాత్రమే వాడాలి. ఎక్కువ రోజులు ఇల్లు వదిలి వెళ్లేటప్పుడు మెయిన్ స్విచ్ ఆఫ్ చేసుకోవాలి. చిన్నపిల్లలను వంటగదులకు దూరంగా ఉంచాలి. గ్యాస్ వాడేశాక రెగ్యులేటర్ ఆఫ్ చేయాలి. నాణ్యత గల ట్యూబ్ వినియోగించాలి.
- పాఠశాలలు, ఆసుపత్రులు, షాపింగ్ మాల్స్‌లో ఫైర్ అలారం, స్మోక్ డిటెక్టర్లు అవసరమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలి. ఎలక్ట్రికల్ షార్ట్‌సర్క్యూట్ జరగకుండా మినియేచర్ సర్క్యూట్ బ్రేకర్స్‌ను అమర్చాలి. ప్రమాదానికి ఆస్కారమున్న ప్రదేశాలను ముందుగా గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలి. ఫ్లేమ్ ప్రూఫ్, మోటార్ స్పార్క్ స్విచ్‌లను మాత్రమే ఉపయోగించాలి. ఫైర్ ఎవాక్యుయేషన్ డ్రిల్‌ను ప్రతి మూడు నెలలకోసారి ప్రాక్టీసు చేస్తుండాలి.
- గోదాములు, గిడ్డంగులకు సంబంధించి స్టాకును చెక్క స్లాపర్లపై నిల్వ చేయాలి. వస్తువులను వేర్వేరుగా స్టోరేజ్ అరల్లో నిల్వచేసి మధ్యలో గ్యాంగ్‌వే, క్రాస్ సెక్షన్లు ఉంచాలి. 4.5 మీటర్లు ఎత్తు కంటే ఎక్కువలో వస్తువులు నిల్వ చేయకూడదు.
- గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిగా ఎండిన గడ్డిని వాములుగా చిన్నవి వేయాలి. వీటికి నివాస గృహాలకు 60 అడుగుల దూరంలో ఉంచాలి.
- కర్మాగారాల్లో కార్మికులకు బేసిక్ ఫైర్ ఫైటింగ్‌లో శిక్షణ ఇవ్వాలి. మిషనరీ బెల్టులు, పుల్లీలు, విద్యుత్ పరికరాల నుంచి నిప్పు రాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సర్క్యూట్‌లను ఓవర్ లోడ్ చేయాలి.
- విద్యుత్ ప్రమాదాల సమయంలో నీటిని ఉపయోగించరాదు. పొడి ఇసుకను మాత్రమే వాడాలి. మెయిన్ స్విచ్ ఆఫ్ చేశాకే మంటలను ఆపే ప్రయత్నం చేయాలి. విద్యుత్ ప్రవహిస్తున్న వైర్లు, తీగలపై అత్యవసర పరిస్థితుల్లో కార్బన్ డయాక్సైడ్ ఎక్స్ ట్వింగిషర్‌ను ఉపయోగించాలి.

నిబంధనలు పాటించాలి



అగ్నిప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అజాగ్రత్త కారణంగానే ఎక్కువ శాతం ప్రమాదాలు జరుగుతుంటాయి. ప్రమాదం సంభవిస్తే వెంటనే 101 నంబర్‌కు కాల్ చేయాలి. పాఠశాలలు, ఆసుపత్రులు, దుకాణాలు, సినిమా హాళ్లు, పరిశ్రమల్లో అగ్నిమాపక నివారణ పరికరాలు కచ్చితంగా అందుబాటులో ఉంచాలి. నిబంధనలు పాటించకపోతే ఫైర్ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తాం.
– ఐ.అజయ్‌కుమార్, ఫైర్ అధికారి, తణుకు

● గడపగడపకు సంక్షేమం


కాళ్ల: కోపల్లె గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ వృద్ధురాలికి సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

రేపు 'తిరుమల'లో అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంలోని తిరుమల విద్యాసంస్థల ప్రాంగణంలో ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు పదో తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు జేఈఈ (మెయిన్స్), జేఈఈ (అడ్వాన్స్‌డ్), నీట్ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో 10వ తరగతి తరువాత చేరబోయే వివిధ కోర్సులు, ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ పోటీ పరీక్షలకు ఏవిధంగా సన్నద్ధంగా ఉండాలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తెలియజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

22 నుంచి వెంకన్న వైశాఖ బ్రహ్మోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీవేంకటేశ్వరస్వామివారి దేవస్థానంలో ఈ నెల 22 నుంచి 27వ తేదీ వరకు స్వామివారి చతుఃస్త్రింశత్ వార్షిక వైశాఖ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24న శ్రీ ధన్వంతరేష్టి, సాయంత్రం స్వామివారి కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. 25న భగవద్రామానుజ తిరునక్షత్రం సందర్భంగా విశేష పంచామృత అభిషేకాలు, శ్రీ సుదర్శన నారసింహేష్టి నిర్వహిస్తామని వివరించారు.

ఇరువర్గాలపె కేసులు

ఆగిరిపల్లి: ఈదరలో మామిడి తోటకు నీళ్లు పెట్టే విషయమై అన్నదమ్ముల బిడ్డలైన సర్నాల రాంబాబు, సర్నాల సాంబశివరావు ఈ నెల 16న కొట్టుకున్నారు. ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై చంటిబాబు సోమవారం చెప్పారు.

గేదెల యజమానిపై గంజాయి ముఠా దాడి

నలుగురు నిందితుల అరెస్టు

భీమడోలు: గేదెల యజమానిపై దాడి ఘటనలో గంజాయి ముఠాకు చెందిన నలుగురు వ్యక్తులను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. భీమడోలులోని ఇందిరాకాలనీకి చెందిన కరణం హరిబాబు తన గేదెలను కోమటిగుంట ఏరియాలో ఆదివారం సాయంత్రం మేపుకుంటున్నాడు. ఇదిలా ఉండగా, భీమడోలులోని ఇందిరాకాలనీ, బీసీ కాలనీలకు చెందిన గంజాయి, హత్య కేసులో బెయిల్‌పై బయట ఉంటున్న నిందితులు మద్దా కల్యాణ్, బెంగుళూరులో అడవిడి ప్రాంతంలో గంజాయి అమ్ముతూ పట్టుబడిన ముద్దాయి కర్రి సత్యనారాయణతో పాటు వారి స్నేహితులు గండి నవీన్, వెజ్జు శ్రీనివాస్ నాయుడు బైక్‌పై గంజాయి, మద్యం మత్తులో ఆ ప్రాంతంలో రాడ్‌లను పట్టుకుని సంచరిస్తున్నారు. అదే సమయంలో గేదెలను కాస్తున్న కరణం హరిబాబు వారి కంట పడ్డాడు. దీంతో వీరు హరిబాబును డబ్బులు ఇవ్వాలంటూ బెదిరించారు. తన దగ్గర లేవనడంతో కోపోద్రేక్తులై హరిబాబు తలపై రాడ్‌తో కొట్టారు. తీవ్ర గాయాలైన హరిబాబును కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ నిందితులను అరెస్ట్ చేశారు. గంజాయి ముఠాపై కేసులున్నప్పటికీ బెయిల్‌పై వచ్చి తమ ప్రాంతాల్లో పగలు, రాత్రి తేడా లేకుండా చెలరేగిపోతున్నారని, నిత్యం ఇళ్లపై దాడులు చేస్తున్నారని బీసీ, ఇందిరా కాలనీవాసులు సీఐ వి.వెంకటేశ్వరరావు, ఎస్సై చావా సురేష్‌కుమార్‌లకు ఫిర్యాదు చేశారు. దీనిపై సీఐ మాట్లాడుతూ నిందితులపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇవ్వడంతో వెనుదిరిగారు.


బాధితుడు కరణం హరిబాబు

రేపు బీవీఆర్‌లో సాంస్కృతిక సమాహారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బీవీఆర్ కళాకేంద్రంలో బుధవారం సాయంత్రం 6 గంటలకు సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక సమాహారం నిర్వహిస్తున్నట్లు బీవీఆర్ వ్యవస్థాపకులు బుద్దాల వెంకట రామారావు పేర్కొన్నారు. భారతీయ విద్యాభవన్స్ ఉపాధ్యాయులు ఎ.రమేష్ ఫ్లూట్, గిటార్ కచేరి, కళాకారులతో ట్రాక్ సింగింగ్, చిన్నారుల నృత్య కార్యక్రమం, సభా, సత్కారాలు ఉంటాయని వెల్లడించారు. ఆకుతీగపాడు సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లుకు గౌరవ పురస్కారం, ప్రముఖ బుర్రకథ కళాకారుడు యడవల్లి వినయవర్దన్‌కు ఆర్థిక సత్కారం చేస్తారని వెల్లడించారు. కళాకారులు, ప్రజలు, సాహితీ సభ్యులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

నరసాపురం/పాలకొల్లు అర్బన్: హత్య కేసులో నేరం రుజువు కావడంతో ఓ వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జి పి.విజయదుర్గ సోమవారం తీర్పు చెప్పారు. ఏపీపీ నల్లిమిల్లి జోసఫ్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. దగ్గులూరుకు చెందిన దాసరి సత్యనారాయణ, అంగర వెంకన్న స్నేహితులు. ఒకేచోట కూలి పనులు చేసుకునే వారు. 2018 సెప్టెంబర్ 13వ తేదీ రాత్రి 9 గంటల సమయంలో పని ముగిసిన తరువాత సత్యనారాయణ రూ.500 వెంకన్నకు ఇచ్చి మూడు మద్యం బాటిళ్లు తెమ్మన్నాడు. అయితే వెంకన్న అందులో ఒక బాటిల్‌ను దారిలోనే తాగేసి మిగిలిన రెండు బాటిళ్లను సత్యనారాయణ వద్దకు తీసుకెళ్లాడు. ఇంకో బాటిల్ ఏదీ అనే దానిపై ఇద్దరి మధ్య గొడవ తలెత్తింది. దగ్గులూరు సంతమార్కెట్ వద్ద ఇద్దరూ కొట్టుకుంటుంటే అక్కడున్న వారు వారిని విడదీసి పంపించి వేశారు. అయితే వెంకన్న మద్యం మత్తులో సంత మార్కెట్ వద్దే సిమెంట్ దిమ్మెపై ఆ రాత్రి పడుకున్నాడు. సత్యనారాయణ మళ్లీ అర్ధరాత్రి అక్కడకు వచ్చి నిద్రిస్తున్న వెంకన్నపై బండరాయితో దాడి చేసి చంపేశాడు. పాలకొల్లు రూరల్ ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేయగా, అప్పటి సీఐ రజనీకుమార్ దర్యాప్తు చేశారు. ఈ కేసులో నిందితుడు నేరం రుజువు కావడంతో అతడికి యావజ్జీవ శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

● అవగాహనే 'కీల'కం


భీమడోలులో పాఠశాలలో గ్యాస్ సిలిండర్ నుంచి వచ్చే మంటలను సిబ్బంది పర్యవేక్షణలో ఆర్పుతున్న విద్యార్థి

అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో వాటి నివారణకు ఏం చర్యలు తీసుకోవాలో అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. సోమవారం భీమడోలు పాఠశాలలో నిర్వహించిన మాక్ డ్రిల్‌లో భాగంగా గ్యాస్ సిలిండర్ నుంచి లీకేజీ వల్ల మంటలు చెలరేగిన సందర్భంలో దానిని ఎలా ఆర్పాలో ఓ విద్యార్థితో ప్రయోగాత్మకంగా ఇలా చేయిస్తూ వివరించారు.
- భీమడోలు

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్టు

ఆకివీడు: స్థానిక వెంకయ్య వయ్యేరు రైల్వే వంతెన కింద గంజాయి అమ్ముతున్న నలుగురు వ్యక్తుల్ని సోమవారం అదుపులోకి తీసుకుని వారి నుంచి 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కే.రాజారెడ్డి చెప్పారు. రైల్వే వంతెన కింద సుతారి రాజేష్(బోయపాడేరు), తిప్పాని చందు (ఉండి), చదలవాడ కృపారావు(మొగల్తూరు), కాంతిమండ జోయల్ స్పందన్ (మొగల్తూరు)లను అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి మూడు సెల్‌ఫోన్లు, రూ.800 నగదు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్వర్ణకారుల 'ఉమ్మడి' వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లక్కోజు

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్వర్ణకారుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏలూరుకు చెందిన ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లక్కోజు రాజగోపాలచారి ఎన్నికయ్యారు. ఈనెల 16న రాత్రి పాలకొల్లులో రాష్ట్ర అధ్యక్షులు కర్రి వేణుమాధవ్ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. వివరాలను లక్కోజు రాజగోపాలాచారి సోమవారం ఏలూరులో విలేకరులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణకారుల సమస్యలపై సుదీర్ఘ పోరాటం చేస్తున్నామన్నారు. కార్పొరేట్ రంగం వల్ల స్వర్ణకారులు అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారన్నారు. బ్యాంకుల్లో అప్రైజర్లుగా పనిచేసే స్వర్ణకారులను ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ప్రస్తుతం హెచ్‌యూఐడీ హాల్ మార్క్ విధానం స్వర్ణకారులకు చాలా ఇబ్బందికంగా ఉందని, స్వర్ణకారులు ప్రత్యేకంగా హాల్ మార్కింగ్ చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాల్సిందిగా రాష్ట్ర అధ్యక్షులు దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని స్వర్ణకారుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. స్వర్ణకారులకు 150 యూనిట్లు కరెంట్ ఉచితంగా ఇవ్వడం అభినందనీయమన్నారు. జిల్లాలోని స్వర్ణకారులకు ఏ సమస్య వచ్చినా పరిష్కారానికై తన వంతు సహకారం అందజేస్తానని లక్కోజు రాజగోపాలాచారి చెప్పారు. స్వర్ణకారుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన లక్కోజు రాజగోపాలాచారికి నగరంలోని పలువురు అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయం



ఆర్థిక సాయం అందిస్తున్న చెన్నా జనార్ధనరావు

తాడేపల్లిగూడెం (టీటీసీ): గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ ఫౌండర్ చెన్నా త్రికళ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. నెలవారీ సేవా కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ట్రస్టీ చెన్నా జనార్ధన్ చేతుల మీదుగా దాత వాణి సౌజన్యంతో తాడేపల్లిగూడెం పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమానికి 200 కేజీలు, లార్డ్ ఆఫ్ లైఫ్ చిల్డ్రన్ హోంకి 150 కేజీలు, నిడదవోలు లెప్రసీ కాలనీకి 300 కేజీలు బియ్యం పంపిణీ చేశారు. ఒంటరి మహిళ, వారి పిల్లల కోసం ఆర్థిక సాయం రూ 5,000 అందించారు. ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వెంకట్రామన్నగూడెంలో చెరువు అభివృద్ధికి శ్రీకారం


వెంకట్రామన్నగూడెంలో చెరువు అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వెంకట్రామన్నగూడెంకు చెందిన వెలగకుంట చెరువు అభివృద్ధికి సోమవారం సర్పంచ్ పోలిమోను నాగఅంజూష శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమృత్ సరోవర్‌లో భాగంగా చెరువును అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. వర్షాకాలంలో నీటితో నింపుకుని దాళ్వా సీజన్‌లో పంట అవసరాలకు వినియోగిస్తామన్నారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించనున్నట్టు తెలిపారు. విద్యా కమిటీ చైర్మన్ నీలపాల రమేష్, వైస్ ప్రెసిడెంట్ రాపాక కొండమ్మ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ములగాల చినశ్రీను, సొసైటీ డైరెక్టర్ బొట్టా నాగరాజు, బండారు నాగేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మి పాల్గొన్నారు.

అలంపురం సర్పంచ్ చెక్ పవర్ రద్దు

పెంటపాడు: పెంటపాడు మండలం అలంపురంలో నిధుల దుర్వినియోగానికి సంబంధించి జరిగిన అవకతవకలపై సర్పంచ్, కార్యదర్శులపై కలెక్టర్ పి. ప్రశాంతి చర్యలు తీసుకున్నట్టు పెంటపాడు మండల ఇన్‌చార్జి ఎంపీడీవో టీవీ సత్యనారాయణ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయం నుంచి సోమవారం ఉత్తర్వులు వెలువడినట్లు ఆయన తెలిపారు. గ్రామానికి చెందిన సర్పంచ్ తాతపూడి ప్రగతి చెక్ పవర్ రద్దు కాగా, పంచాయతీలో ఇన్‌చార్జి కార్యదర్శిగా పనిచేస్తున్న సీహెచ్ అనిల్‌కుమార్‌ను కలెక్టర్ సస్పెండ్ చేసినట్లు తమకు ఉత్తర్వులు అందాయన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీటీసీ): పెదతాడేపల్లి 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం పట్టణంలోని వన్ టౌన్, టూ టౌన్ పరిధిలో అన్ని ప్రాంతాల్లో ఈ నెల 18వ తేదీ మంగళవారం మూడు గంటల పాటు ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ డివిజనల్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఇదే సమయంలో హౌసింగ్‌బోర్డు, కొండయ్య చెరువు, పాతూరు సబ్ స్టేషన్‌లకు సంబంధించి 11కేవీ ఫీడర్ల మరమ్మతులు నిర్వహించనున్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సమస్యల పరిష్కారానికి యూత్ ఫోర్స్ కృషి

సాక్షి, భీమవరం: అగ్నికుల క్షత్రియుల డిమాండ్ల సాధనకు సమైక్యంగా కృషి చేయాలని అగ్నికుల క్షత్రియ యూత్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు చింతా రామకృష్ణ అన్నారు. యలమంచిలి మండలం కట్టుపాలెంలో జిల్లా అధ్యక్షుడు నాగిడి శ్యామ్ అధ్యక్షతన నిర్వహించిన యూత్ ఫోర్స్ జిల్లా కార్యవర్గ సమావేశం వివరాలను సోమవారం భీమవరంలో పేర్కొన్నారు. అగ్నికుల క్షత్రియుల సమస్యల పరిష్కారానికి యూత్ ఫోర్స్ కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం పాలకొల్లు నియోజకవర్గ అధ్యక్షుడిగా లంకే ధర్మరాజు, యలమంచిలి మండ ల అధ్యక్షుడిగా మల్లాడి ధర్మరాజులకు నియామక పత్రాలను అందజేశారు

ముగిసిన యెహోవా సభలు

పాలకోడేరు: పెన్నాడ గ్రామంలోని పాలెం రోడ్డులో మూడు రోజులపాటు నిర్వహించిన యెహోవా ఈరే సభలు సోమవారంతో ముగిశాయి. సభల్లో ముఖ్యఅతిథిగా యూపీఏ మండల అధ్యక్షుడు గోపే సాల్మన్ రాజు పాల్గొని మాట్లాడుతూ దేవుని పనిని నెరవేర్చిన వారు ధన్యులవుతారని ఉపదేశించారు. ప్రతిఒక్కరూ క్రీస్తు నామములో యెహోవాను స్తుతించాలని కోరారు. ఆరాధన గీతాలు, ప్రత్యేక ప్రార్థనలతో సభలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బైబిల్ మిషన్‌కు చెందిన ముఖ్య ప్రసంగీకులు డాక్టర్ జె.సామ్యూల్ కిరణ్, పీజే ప్రవీణ్ ఒనోసిం, డి.ఉజ్జీవం, పాస్టర్ వలవల సద్గుణ రాజు, సభల కన్వీనర్ వలవల కిరణ్ కుమార్, విశ్వాసులు పాల్గొన్నారు.

సీఎం జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు

- వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కట్టుబోయిన
- జట్లపాలెంలో ఇంటింటా ప్రచారం ప్రారంభం


జట్లపాలెంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న కట్టుబోయిన కృష్ణప్రసాద్, సర్పంచ్ తదితరులు

పెంటపాడు: జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు ముడిపడి ఉందని, రాబోయే రోజుల్లో సీఎం జగనన్నను ప్రతి ఒక్కరూ ఆదరించాలని మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ సూచనలతో ఆది, సోమవారాల్లో గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాల బ్రోచర్‌లను గ్రామంలో ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానాల్లో నూరుశాతం అమలు చేయడంతో పాటు, ఇవ్వని హామీలు సైతం అమలు చేస్తూ రాష్ట్రాభివృద్ధికి, ప్రజల ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు అండగా ఉండాలన్నారు. ప్రజల కోసం ఎంతో కష్టపడుతున్న సీఎం జగనన్నను, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను మరో మారుప్రజలందరూ ఆదరించాలన్నారు. వైఎస్సార్ సీపీ విజయయాత్ర కొనసాగేలా పార్టీ కార్యకర్తలు, ప్రజలు సంసిద్ధంగా ఉండాలన్నారు. సర్పంచ్ ఖండవల్లి మణిరాజు, ఎంపీటీసీ సభ్యురాలు కట్టుబోయిన వెంకటలక్ష్మి, సచివాలయ కన్వీనర్లు మీసాల మోషేష్, కుదుళ్ల బుచ్చిబాబు, గుమ్మళ్ల రత్తయ్య, గంజి ఏసు, దాసి రాజు, గొన్నూరి గంగరాజు, గృహసారధులు, వాలంటీర్లు పాల్గొన్నారు. 1,2,3,4,10 వార్డుల్లో నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో గ్రామ పార్టీశ్రేణులు పాల్గొన్నారు. అలంపురంలో సొసైటీ అధ్యక్షుడు కొలనువాడ దత్తుడు, దెందుకూరి సూరిబాబు, రావిపాడులో సొసైటీ అధ్యక్షుడు దేవ వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యులు బొచ్చెల తాతారావు, కైగాల కొండ, పెంటపాడులో ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, బర్ల జయరాంబాబు, ఉపసర్పంచ్ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

జగనన్న నమ్మకాన్ని గెలిపించండి


జగన్నాథపురంలో జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ శేషులత

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్ర ప్రజలపై సీఎం జగనన్న పెట్టుకున్న నమ్మకాన్ని రాబోయే ఎన్నికల్లో గెలిపించాలని ఎంపీపీ పొనుకుమాటి శేషులత అన్నారు. సోమవారం మండలంలోని జగన్నాథపురం, నవాబుపాలెం, బంగారుగూడెం, కృష్ణాయపాలెంలో జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు, గృహసారథులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పనితీరుపై ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. జగన్నాథపురంలో ఎంపీపీ శేషులత మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని ప్రజలు భావిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

సంయమనం పాటించాలి

ఇరగవరం: సంయమనం పాటించాలని, శాంతియుతంగా సమస్యలను పరిష్కరించుకోవాలని పెనుగొండ సీఐ నాగేశ్వరరావు తూర్పువిప్పర్రు గ్రామస్తులకు సూచించారు. ఇరగవరం మండలం తూర్పువిప్పర్రులో అంబేడ్కర్ ఫ్లెక్సీ ధ్వంసం వివాదం కారణంగా గ్రామంలో ఉద్రిక్త వాతావరణ నెలకొంది. ఫ్లెక్సీ చించిన చోట ఆదివారం ఒక వర్గం యువత అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేశారు. విగ్రహాన్ని అక్కడి నుంచి తొలగించాలని మరొక వర్గం వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో గొడవకు సంబంధం లేని కొందరిని స్టేషన్‌కి పిలిచి విగ్రహాన్ని అక్కడి నుంచి తొలగిస్తున్నామని వారితో కాగితాలపై సంతకాలు చేయించుకోవడంపై గ్రామంలోని ఒక వర్గం యువకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎస్సై కె చంద్రశేఖర్‌ని వివరణకోరగా గ్రామంలో జరిగిన గొడవల నేపథ్యంలో ఇరు వర్గాల నుంచి ఐదుగురు చొప్పున పది మందితో శాంతి కమిటీ ఏర్పాటు చేశామన్నారు. వారి ఒప్పందం, పంచాయతీ తీర్మానంతో పంచాయతీ వద్ద ఒక విగ్రహం, ఇప్పుడు ఏర్పాటుచేసిన విగ్రహాన్ని అక్కడి నుంచి తొలగించి హైస్కూల్లో పెట్టాలని తీర్మానించినట్టు తెలిపారు. దీనికి ఇరువైపుల పెద్దలు అంగీకరించారని తెలిపారు. ఒక వర్గంలో వ్యక్తి అంగీకరించలేదని, అతడిని మినహాయించి మిగిలిన తొమ్మిది మంది సంతకాలు చేశారని తెలిపారు. 15 రోజుల పాటు గ్రామంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. 144 సెక్షన్ అమలవుతున్నా ఒక వర్గానికి చెందిన యువత, మరి కొంత మంది రోడ్లపైకి వస్తున్నారు. అక్కడికి వచ్చిన పెనుగొండ సీఐ నాగేశ్వరరావు వారికి నచ్చ చెప్పి ఇంటికి పంపించారు.

జాగ్రత్తలు పాటిస్తే అగ్నిప్రమాదాల నివారణ

అత్తిలి: తగు జాగ్రత్తలను పాటిస్తే అగ్నిప్రమాదాలను నివారించవచ్చని అగ్నిమాపక అధికారి సీహెచ్ రాజంరాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం అత్తిలి మాంటిస్సోరి స్కూల్లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు అగ్నిమప్రమాదాల నివారణపై మాక్‌డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

తణుకు: అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తణుకు అగ్నిమాపక అధికారి ఐ.అజయ్ కుమార్ కోరారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక వివేకానంద గ్లోబర్ స్కూలు ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన చర్యలతోపాటు మంటలను ఆర్పే విధానంపై అవగాహన కల్పించారు. పాఠశాలలు, కర్మాగారాల్లో తప్పనిసరిగా అగ్నిమాపక పరికరాలు ఉంచాలని సూచించారు. అనంతరం సీపీఆర్ విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.


అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన రక్షణ చర్యలను విద్యార్థులకు వివరిస్తున్న ఫైర్ ఆఫీసర్

అగ్నిప్రమాదాలపై డెమో ప్రదర్శన

తాడేపల్లిగూడెం (టీటీసీ): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నాల్గో రోజు సోమవారం అగ్నిమాపక అధికారి గణేశ్న వెంకట రామారావు ఆధ్వర్యంలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో అగ్నిప్రమాదాలు-నివారణపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక నివారణ పరికరాలతో డెమో ప్రదర్శన నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు.

దంతుపల్లిలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

అత్తిలి: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదికకు చెందిన భీమవరం వారి ఆధ్వర్యంలో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం, సాంద్ర సింధు వేదంపై దంతుపల్లిలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మల వివరాలు తెలుసుకోవడం ద్వారా మధ్యాత్మ ఆరాధనతో ధర్మ స్థాపన సాధ్యమవుతుందని సంస్థ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ చెప్పారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను గ్రామాల్లో ప్రచారం చేసారు. త్రైత సిద్ధాంతం భగవద్గీత జ్ఞానం ద్వారా సమాజంలోని ప్రజల మధ్య అసమానతలను తొలగించేందుకు, సర్వ మతాలకు దేవుడు ఒక్కడేనని ప్రజల్లో దైవ భక్తిని పెంపొందించేందుకు దోహదం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు నాగేశ్వరరావు, వాసుదేవా, ప్రసాదు, సత్యనారాయణ, గోపి, రాము, మూర్తి, శ్రీకర్, సుందరరావు, హనుమంతరావు, యశోదలక్ష్మి, తారకేశ్వరి, భానుమతి, శ్రీరేఖ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.


దంతుపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక సభ్యులు

ఎడ్యుకేషన్ ఇండియాతో ఎస్ఆర్‌కేఆర్ ఒప్పందం

సాక్షి, భీమవరం: విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో పరిశోధన, ఉన్నత విద్యారంగంలో అవకాశాలు మెరుగుపరిచేందుకు అంతర్జాతీయ అభివృద్ధి కార్యక్రమం (ఐడీపీ) ఎడ్యుకేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల అవగాహన ఒప్పందం చేసుకుందని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు చెప్పారు. ఐడీపీ సీనియర్ ఏరియా మేనేజర్ పి.అనిల్ కుమార్‌కు సోమవారం ఒప్పంద పత్రాలను అందించారు. కళాశాల విదేశీ భాషా విభాగం అధిపతి బీహెచ్‌వీఎస్ లక్ష్మి మాట్లాడుతూ ఇతర దేశాల్లో ఉన్నత చదువులకు వెళ్లే విద్యార్థులకు అంతర్జాతీయ ఇంగ్లిష్ పరిజ్ఞానం ఎంతో అవసరమని, దీనికి ఐఈఎల్‌టీఎస్ పరీక్ష తమ కళాశాలలో ఏర్పాటు చేసేందుకు ఐడీపీ సంస్థ ముందుకు వచ్చిందని తెలిపారు. పరీక్ష మెటీరియల్ తీసుకొని అవసరమైన శిక్షణ కూడా ఫారెన్ లాంగ్వేజెస్ విభాగంతో పొందవచ్చని, ఇది విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఐఈఎల్టీఎస్ అసిస్టెంట్ మేనేజర్ ఎం.చైతన్య, కళాశాల ఐఈఎల్ టీఎస్ కోఆర్డినేటర్ రమేష్ విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

18 మందికి ఉద్యోగాలు

కోర్ గ్రూప్ ఇంజినీరింగ్ విద్యార్థులకు మంచి వేతనంతో వివిధ సంస్థల్లో ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయని స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జగపతిరాజు అన్నారు. జిందాల్ స్టీల్స్ సంస్థలో రూ.6.5 లక్షల వార్షిక వేతనంతో గ్రాడ్యుయేట్ ట్రైనీ ఇంజినీర్స్‌గా ఉద్యోగాలు పొందిన కళాశాలలోని వివిధ విభాగాలకు చెందిన 18 మంది ఫైనల్ ఇయర్ విద్యార్థులను సోమవారం అభినందించారు. ఆ వివరాలను ప్రిన్సిపాల్ వెల్లడించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌కు చెందిన 11 మంది, మెకానికల్ ఇంజినీరింగ్ నుంచి నలుగురు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్‌రంగరాజు, అధ్యాపకులు కె.ఆర్ సత్యనారాయణ, జీవీఎస్ పద్మారావు, కె.బ్రహ్మారాజు, బీఆర్‌కే వర్మ, డి.వెంకటపతి రాజు తదితరులు అభినందించారు.


ఎడ్యుకేషన్ ఇండియాతో ఒప్పంద పత్రాలను అందుకుంటున్న కళాశాల సిబ్బంది

తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళిక

సాక్షి, భీమవరం: వేసవికాలం దృష్ట్యా పట్టణంలో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు ప్రణాళికలను తయారుచేయాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆదేశించారు. భీమవరం పట్టణ అభివృద్ధిపై సోమవారం రాత్రి మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే శ్రీనివాస్ తన క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. పట్టణంలో నిర్వహిస్తోన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లతో వెంటనే పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. శానిటేషన్ పరంగా ఎప్పటికప్పుడు శానిటేషన్ అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన పరిధిలలో పర్యవేక్షణ చేయాలని అన్నారు. సమావేశంలో ఎంఈ త్రినాథరావు, డీఈలు తోట నారాయణరావు, విజయ్, ఏఈలు నవ్య, కృష్ణమూర్తి, శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఆక్వా రైతుల సమావేశం

సాక్షి, భీమవరం : ఈ నెల 18న ఉండిలో జిల్లా స్థాయి ఆక్వా రైతుల సమావేశం ఏర్పాటు చేసినట్టు రొయ్య రైతుల వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గాదిరాజు వెంకట సుబ్బరాజు చెప్పారు. ఆక్వా రైతులకు అండగా నిలబడిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్టు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు పెను భారంగా మారిన విద్యుత్ బిల్లులను తగ్గించే క్రమంలో 10 ఎకరాల్లోపు అర్హత కలిగిన రైతులందరికీ విద్యుత్ సబ్సిడీ వర్తింపజేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, సమస్య పరిష్కారానికి కృషి చేసిన అప్సడ కో వైస్ చైర్మన్ వడ్డి రఘురాంలకు తమ సంఘం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. దీనిలో భాగంగా ఫిషరీస్, విద్యుత్ అధికారులకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ.. అప్సడా కో వైస్ చైర్మన్ రఘురాంను సత్కరించనున్నట్టు సుబ్బరాజు వెల్లడించారు.

దళిత జాతికి కన్నా క్షమాపణ చెప్పాలి


సమావేశంలో మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీటీసీ): టీడీపీ నేత కన్నా లక్ష్మీనారాయణ దళిత జాతికి క్షమాపణ చెప్పాలని, లేకుంటే దళితులంతా ఏకమై ఆయన ఎక్కడ పోటీచేసినా ఓడిస్తామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు పేర్కొన్నారు. మాలమహానాడు ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. మంగరాజు మాట్లాడుతూ అంబేడ్కర్ జయంతి రోజున గుంటూరులో అంబేడ్కర్ సర్కిల్‌గా నామకరణం చేసేందుకు సాంఘిక సంక్షేమ మంత్రి మెరుగు నాగార్జున హాజరు కావాల్సి ఉందన్నారు. ముందుగా వచ్చిన టీడీపీ నేత కన్నా లక్ష్మీనారాయణ ప్రోటోకాల్‌ని కాదని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేయడంతో పాటు దానిని వారించేందుకు యత్నించిన దళిత నాయకుడు బోడపాటి కిషోర్‌ను తోసేసి, దూషించడం హేయమైన చర్య అని విమర్శించారు. కన్నా లక్ష్మీనారాయణ దళిత జాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్లుగా ఏ పదవీ లేకపోవడంతో కన్నాకు మతి భ్రమించినట్లుగా ఉందని అన్నారు. మంత్రిని కాదని అంబేడ్కర్ విగ్రహానికి తొలుత దండ వేస్తానని దౌర్జన్యం చేయడం శోచనీయం అన్నారు. మంత్రిగా పనిచేసిన కన్నాకు ప్రోటోకాల్ విలువ తెలియకపోవడం దారుణం అన్నారు. ఇప్పటికైనా కన్నా లక్ష్మీనారాయణ బుద్ధి తెచ్చుకొని అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి దళిత జాతికి క్షమాపణ చెప్పాలన్నారు. లేకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ధోరణిలోనే ఆ పార్టీ నాయకులంతా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో సుందర్, రాజారావు, మోహన్, సందీప్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్ ఇజ్రాయిల్‌కు అభినందన



తాడేపల్లిగూడెం (టీటీసీ): వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీలో రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఏపీఎస్ ఆర్టీసీ తాడేపల్లిగూడెం డిపో కండక్టర్ ఎస్.ఇజ్రాయిల్‌కు సోమవారం ఆర్టీసీ సిబ్బంది, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా వెలువడిన నియామకపత్రాన్ని జిల్లా డీపీటీఓ, గూడెం డిపో మేనేజర్‌కు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా పథకం అందజేత

తాడేపల్లిగూడెం (టీటీసీ): ఇటీవల గుండెపోటుతో స్థానిక 13వ వార్డు నివాసి ఎల్ఎస్‌వీ కుమార్ మృతి చెందగా ఆయన భార్య దేవికి వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా మట్టి ఖర్చులు నిమిత్తం సోమవారం వార్డు ఇన్‌చార్జి తెన్నేటి జగ్జీవన్ చేతుల మీదుగా రూ.10 వేలు అందజేశారు. జగ్జీవన్ మాట్లాడుతూ కుటుంబానికి పెద్ద దిక్కు యజమాని హఠాత్తుగా మరణించడం ఎవరూ తీర్చలేని లోటు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబానికి బాసటగా నిలుస్తోందని మిగిలిన రూ.90 వేలు వారి అకౌంట్‌కు జమ చేస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ యర్రంశెట్టి కృష్ణవేణి, అడ్మిన్ ఎస్.సూర్యచంద్రం, సెక్రటరీ రాజ్‌కుమార్, వాలంటీర్ ధనకుమారి, తోట వేణులు పాల్గొన్నారు.

స్పందనకు రెండు అర్జీలు

తాడేపల్లిగూడెం రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూకు సంబంధించి రెండు అర్జీలు అందాయని ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వీఎస్.వేణుగోపాల్ తెలిపారు. తహసీల్దార్ వైకేవీ.అప్పారావు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో వీఎస్.వేణుగోపాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి సొసైటీ సిబ్బందిని అభినందిస్తున్న కొట్టు విశాల్

పెంటపాడు: రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తనయుడు కొట్టు విశాల్ పేర్కొన్నారు. రావిపాడులో సొసైటీ ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ అధ్యక్షుడు దేవ వెంకటరమణ ఆధ్వర్యంలో మండల జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పులూరి వరలక్ష్మి, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు కొట్టు విశాల్ ఈ కార్యక్రమంలో పాల్గొని రైతులను కలిసి సొసైటీ సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా విశాల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయడంతో పాటు, ఇన్‌పుట్ సబ్సిడీ, యాంత్రీకరణ పనిముట్లు, కొనుగోలు కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాలు ఇలా ఎన్నో రకాలుగా రైతుల ఉన్నతికి జగనన్న చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని పండించిన పంటకు మద్దతు ధర పొందాలన్నారు. దళారులను ఆశ్రయించి మోసపావద్దన్నారు. సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు వింజమూరి శ్రీనివాస్, దాట్ల రామలింగరాజు, సర్పంచ్ చాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, ములగాల రామసత్యనారాయణ, కైగాల గణపతి, పూడి శ్రీను, సంఘ కార్యదర్శి మాదాసు రాంబాబు, డీసీసీబీ సీనియర్ ఇనస్పెక్టర్ వై. రవికుమార్, గ్రామ ఎంపీటీసీ సభ్యులు బొచ్చెల తాతారావు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగు మేలు

పాలకోడేరు: పంటకు పంటకు మధ్య కాలంలో నవధాన్యాలు పచ్చిరొట్ట సాగు చేయడం వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని వ్యవసాయ శాఖ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ అరుణ కుమారి పేర్కొన్నారు. బంటుమిల్లిలో సోమవారం ఏర్పాటుచేసిన మహిళా సంఘాలు, రైతుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పచ్చి రొట్టలు సాగు చేయడం వల్ల నేల గుల్లబారి, వానపాములు అభివృద్ధి చెందుతాయని, నీటి సామర్థ్యం పెరుగుతుందని వివరించారు. పశువులకు గ్రాసం పచ్చి మేతగా ఉంటుందన్నారు. జీవ వైవిధ్యం పెరుగుతుందని, చీడపీడలు తట్టుకునే సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో డివిజన్ ఇన్‌చార్జి స్వామి, మండల ఇన్‌చార్జి రవికుమార్ మహిళా సంఘాల సభ్యులు రైతులు పాల్గొన్నారు.


బంటుమిల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చలివేంద్రం ప్రారంభం

వీరవాసరం: ప్రతి ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాల దుర్గా నాగమల్లేశ్వరరావు (బాబు) అన్నారు. శ్రీకృష్ణదేవరాయ నాటకళా పరిషత్, సేవాసమితి ఆధ్వర్యంలో రాయకుదురు లింగాకారం సెంటర్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజల దాహార్తిని తీర్చడానికి వేసవిలో చలివేంద్రాలని ఏర్పాటు అభినందనీయమన్నారు. మజ్జిగ, సబ్జా వాటర్, కూలింగ్ వాటర్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండ ల కన్వీనర్ గూడూరు ఓంకారం, సర్పంచ్ గడ్డం భారతి, శ్రీ కృష్ణ దేవరాయ నాటక కళా పరిషత్ అధ్యక్షుడు గోపాలకృష్ణ, వైస్ ఎంపీపీ అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, గడ్డం భాస్కరరావు, గుడాల వెంకటేశ్వరరావు, తోట పెద్దిరాజు, అడ్డాల పుష్ప దుర్గా రమేష్ పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని సాగనంపుదాం

తాడేపల్లిగూడెం (టీటీసీ): ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బీజేపీని సాగనంపుదామని, దేశాన్ని కాపాడుకుందామంటూ పట్టణంలో నాల్గో రోజు సోమవారం సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో హౌసింగ్‌బోర్డు, గణేష్ నగర్, మిలిటరీ కాలనీ, గాయత్రీదేవి సెంటర్, రామారావుపేట, కేఎస్ఎన్ కాలనీలలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచార భేరీ యాత్ర నిర్వహించారు. నాయకులు కర్రి నాగేశ్వరరావు, మండల నాగేశ్వరరావు, కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీను, శిద్ధిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, అల్లం రాము పాల్గొన్నారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీటీసీ): తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. టౌన్, రూరల్ మండలం, పెంటపాడు పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించి సోమవారం సంస్కృతం పరీక్ష నిర్వహించగా 631 మందికి 627 మంది హాజరయ్యారు. నలుగురు గైర్హాజరయ్యారు.

ఆశ్రమాలకు బియ్యం వితరణ

తాడేపల్లిగూడెం (టీటీసీ): గ్లోబల్ సపోర్టు ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమానికి 200 కిలోలు, లార్డ్ ఆఫ్ లైఫ్ అనాథాశ్రమానికి 150 కిలోలు, నిడదవోలు లెప్రసీ కాలనీ వాసులకు 300 కిలోలు బియ్యాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు చెన్నా జనార్ధనరావు మాట్లాడుతూ తమకు ఉన్న దానిలో పరులకు సాయం చేయడంలోనే ఆనందం ఉందన్నారు. ట్రస్టీ చెన్నా ఉమా చేతుల మీదుగా దుర్గకు రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.